సాక్షి
బాపట్ల
బుధవారం, 4, జూన్, 2025



ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు

దాచేపల్లి: దాచేపల్లి పరిధిలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. అనధికార విత్తన నిల్వలపై ఆరా తీశారు.



వైభవంగా దేవస్థానం వార్షికోత్సవం

రెంటచింతల: పాలువాయి గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ వినాయకస్వామి దేవస్థానం 31వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఒత్తిడి నివారణకు యోగా దోహదం

నరసరావుపేట: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం యోగాసనాలు నిర్వహించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠ, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మభ్యపెట్టి... మాయ చేసి

- ఎన్నికల వేళ కూటమి నేతలు హామీలు
- సూపర్ సిక్స్ పేరుతో వంచన
- రైతులకు అందని సుఖీభవ
- తల్లికి వందనం పేరుతో దగా
- ఊసే లేని ఉచిత బస్సు ప్రయాణం
- నిరుద్యోగులకు ఉద్యోగాల వల
- భ్రాంతిగా మారిన నిరుద్యోగ భృతి
- స్థానికంగానూ కుప్పలు తెప్పలుగా హామీలు
- ఏడాది పాలనలో ఏ ఒక్కటీ నెరవేర్చని వైనం
- నేడు 'వెన్నుపోటు దినం' నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ
- నియోజకవర్గాల్లో నిరసన ర్యాలీలు, అధికారులకు వినతిపత్రాలు

అధికారం యావతో అలవికాని హామీలు ఇచ్చి జనాన్ని మభ్యపెట్టి ఓట్లేయించుకున్న కూటమి నేతలు గద్దెనెక్కాక ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నారు. ఏడాది పాలన ముగుస్తున్నా సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్‌తోపాటు స్థానికంగా కుప్పలు తెప్పలుగా ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చక జనాన్ని వంచించారు. రెడ్ బుక్ పాలనపై చూపుతున్న శ్రద్ధ సంక్షేమం, అభివృద్ధిపై చూపడం లేదు. కూటమి ఏడాది పాలనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు 'వెన్నుపోటు'పై జనాగ్రహం



సాక్షి ప్రతినిధి,బాపట్ల: గతఎన్నికల ప్రచారం సందర్భంగా జిల్లాలో పర్యటించిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు సూపర్‌సిక్స్ హామీలతోపాటు జిల్లాలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామంటూ హామీలు గుప్పించారు.

సూపర్ సిక్స్‌కు మంగళం

- ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రకటించింది. జిల్లాలో 1,92,037 మంది రైతులకు రూ.384.07 కోట్లు ఇవ్వాల్సి ఉండగా రెండో ఏడాది ఖరీఫ్ వచ్చినా పైసా ఇవ్వలేదు.
- ఎన్నికల ముందు తల్లికి వందనం కింద ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి ఇస్తామన్నారు. జిల్లాలో గత ప్రభుత్వంలో కుటుంబానికి ఒక్కరు చొప్పున 1,16,019 మందికి రూ.174.02 కోట్లు ఇచ్చారు. ఇప్పుడు కుటుంబానికి ఇద్దరు చొప్పున ఇచ్చినా రూ.350 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. రెండో విద్యాసంవత్సరం వచ్చినా తల్లులపేర పైసా జమచేయలేదు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని చెప్పి ఎగనామం పెట్టారు.
- డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షలు, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో లక్షన్నర కోట్లు అన్నారు.
- స్వయం ఉపాధికి రూ.10 వేల కోట్లు, రూ.5వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ, క్వారీల్లో వడ్డెరలకు 15 శాతం రిజర్వేషన్, రాయల్టీ, సీనరేజ్‌ల్లో మినహాయింపు, దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు నెలకు రూ.25 వేల జీతం అన్నారు.
- రైతుకూలీలకు కార్పొరేషన్లు, 90 శాతం సబ్సిడీతో బిందుసేద్యం, ట్రాన్స్‌ఫార్మర్ల ధరల తగ్గింపు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రూ. 5 లక్షల వడ్డీలేని రుణాలు, ఆటో, ట్యాక్సీ, లారీ, ట్రిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ. 15వేలు, డ్రైవర్ల సాధికార సంస్థ అన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కూటమి మ్యానిఫెస్టోలో వందకు పైగా హామీలు ఇచ్చినా ఒక్కటీ నెరవేర్చలేదు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'

కూటమి పాలకులు ప్రజలకు వెన్నుపోటు పొడవడాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ బుధవారం వెన్నుపోటు దినం నిర్వహిస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున నేతృత్వంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సమన్వయకర్త, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, చీరాల సమన్వయకర్త కరణం వెంకటేష్, వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, పర్చూరు సమన్వయకర్త గాదె మధుసూదన్‌రెడ్డి, రేపల్లె సమన్వయకర్త ఈవూరు గణేష్, అద్దంకి సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డితోపాటు నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.

పవన్ కల్యాణ్ హామీలు

రేపల్లె ప్రాంతంతోపాటు బాపట్ల జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. జూద కేంద్రంగా మారిన రేపల్లెలో పేకాట, ఇతర జూదాలను పూర్తిస్థాయిలో నియంత్రిస్తామన్నారు. ఏడాదిపాలనలో వీటిలో ఒక్కటీ నెరవేర్చలేదు.

లోకేష్ హామీలు



- అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతాం.
- సింగరకొండ భవనాశి రిజర్వాయర్, కొరిశపాడు మండలంలోని ఎర్రం చినపోలిరెడ్డి ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరందిస్తాం.
- అద్దంకి పట్టణంలో వైద్యశాలను వంద పడకలకు విస్తరిస్తాం.

చంద్రబాబు హామీలు

- రేపల్లె పట్టణంలో ప్రభుత్వ వైద్యశాలను వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తా.
- టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తాం.
- రేపల్లెలో శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు.
- బలహీనంగా ఉన్న పెనుమూడి కృష్ణా కరకట్టను పటిష్టం చేస్తాం.
- నిజాంపట్నంను వ్యాస్‌పిక్ సిటీగా అభివృద్ధి చేసి మెగా సిటీగా రూపొందిస్తాం.
- చీరాలలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తాం.
- మత్స్యకారుల ఎగుమతులకు తోడ్పాటు అందిస్తాం.
- చీరాలలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు.
- ఐటీ టవర్ నిర్మాణం చేస్తాం.
- బాపట్ల జిల్లాలోని తీరప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడం.
- బాపట్ల ప్రాంతంలో పూల మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తాం.



కొల్లూరు మండలం దోనేపూడి వద్ద బలహీనంగా ఉన్న కరకట్ట

- అన్ని నియోజకవర్గాల్లో వంద పడకల ఆసుపత్రులు, తాగునీటి పథకాలు, డంపింగ్ యార్డుల ఏర్పాటు.
- జిల్లా వ్యాప్తంగా రహదారుల అభివృద్ధి.
- బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లో చివరి ఆయకట్టుకు సాగునీటి తరలింపు, లిఫ్ట్ స్కీముల ఏర్పాటు.
- తీరంలో తుఫాను షెల్టర్ల నిర్మాణం.

పచ్చ నేతల దౌర్జన్యం

కూటమి ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులపై వేధింపులకు దిగారు. అక్రమ కేసులు బనాయించి టార్చర్ చేశారు.



అద్దంకి మండలం ధర్మవరంలో జేసీబీ తగుల బెట్టిన దృశ్యం

- బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను ప్రభుత్వం టార్గెట్ చేసింది. సురేష్‌ను జైలుకు పంపిన ప్రభుత్వం మరిన్ని కేసులు పెట్టి బయటకు రాకుండా చేసే కుట్రకు తెరలేపింది.
- వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం అద్దేపల్లి ఎస్సీ కాలనీలో దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పచ్చపార్టీవారు పెట్రోల్ పోసి తగుల బెట్టారు. నిరసనకు దిగిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబుపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారు.
- పర్చూరు నియోజకవర్గం యద్దనపూడి మండలానికి చెందిన ఎస్సీ నేతలపై పచ్చ ప్రభుత్వం రౌడీషీట్లు ఓపన్ చేసి కక్షపూరితంగా వ్యవహరించింది.
- రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెంకు చెందిన దళిత నాయకుడు రాజ్‌కుమార్ ఇంటిపై దాడిచేసి గాయపరిచారు. గుళ్లపల్లికి చెందిన మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావుపై పలుమార్లు దాడికి యత్నించారు. ఆయన డ్రైవర్ గాలి సంపత్‌కుమార్‌ఇంటిపై దాడిచేసి గాయపరిచారు.
- అద్దంకి మండలం ధర్మవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ప్రభాకరరెడ్డి ఆయన అనుచరులపై అక్రమ కేసులు పెట్టి వేధించారు. 2024 సెప్టెంబర్ 24న ఆయన పెట్రోల్ బంకుకు నిప్పుపెట్టారు. జేసీబీలను తగులబెట్టారు.
- నగరం మండలం దాసరిపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నున్నా భూషయ్యపై పచ్చపార్టీ నాయకులు దాడిచేసి హత్యచేశారు.

ప్రజలను మోసగించారు



ప్రభుత్వం ప్రజలను ఘోరంగా మోసం చేసింది. సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన ఒక హామీ కూడా అమలు చేయలేదు. ప్రజలకు తల్లికి వందనం పేరుతో ఒక వైపు మోసం చేసిన కూటమి ప్రభుత్వం రైతులను నట్టేటా ముంచింది. కనీస మద్దతు ధర కూడా అందించే పరిస్థితి కనిపించటంలేదు. ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను తొలగించేందుకు కంకణం కట్టుకుంది. ఒకవైపు భారాలపై మోపటమే కాకుండా సంక్షేమం కోసం ఒక మాట కూడా మాట్లాడటం లేదు. ఆర్భాటాలకే పెద్దపీట వేస్తున్న చంద్రబాబునాయుడు సర్కారు ప్రజలను వెన్నుపోటు పొడిసింది. బుధవారం చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రజలు విరివిగా పాల్గొనాలి.

– కోన రఘుపతి, మాజీ డెప్యూటీ స్పీకర్

వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య



చంద్రబాబునాయుడికి వెన్నుపోటు పొడవడం వెన్నతో పెట్టిన విద్య. ప్రతి సారీ తను గెలవడం కోసం అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నాడు. ఈ సారీ అదేవిధంగా సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశాడు. ప్రతిసారీ ప్రజ లు మోసపోకుండా ఆయన విధానాలను ఎండగట్టం కోసమే వెన్నుపోటు దినం కార్యక్రమ లక్ష్యం.

– పానెం చిన హనిమిరెడ్డి
వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, అద్దంకి

బూటకపు హామీలతో మోసం



ఎన్నికల సమయంలో నెర వేర్చలేని బూటకపు హామీలనిచ్చిన చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి ఏడాది పూర్తి అయినప్పటికీ ఏ ఒక్కటీ అమలు చేయ లేకపోవడం బాధాకరం. తన శుష్క వాగ్దానాలతో రాష్ట్ర ప్రజలను మోసగించిన చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచి నేటికి ఏడాది కాలం పూర్తయింది. వెన్నుపోటు పొడవడం అనేది ఆయన నైజం. రాష్ట్రంలో కనీసం రెండు, మూడు శాసనసభ స్థానాల్లో కూడా ప్రజల సమస్యలను పరిష్కరించకపోగా దారుణంగా మోసం చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు ఆయనపై ఉన్న విశ్వాసాన్ని కోల్పోయే పరిస్థితి వచ్చింది.

– గాదె మధుసూదనరెడ్డి,
పర్చూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి

అభివృద్ధి శూన్యం



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతోంది. ఈ కాలంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైఎస్సార్ సీపీ నాయకులే టార్గెట్‌గా పెట్టుకుని అక్రమ కేసులు, అరెస్ట్‌లతో కాలం వెళ్లదీసింది. ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడిగితే దాటవేత ధోరణితో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోంది. నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులకు న్యాయం జరగకపోగా కౌలు రైతులు, పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వం పట్టించుకోవడంలేదు.

-కరణం వెంకటేష్,
వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి

రెడ్ బుక్ పాలనపై దృష్టి



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వెన్నుపోట్లు పొడవటం వెన్నతో పెట్టిన విద్య. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పేద ప్రజలను వెన్నుపోటు పొడిచారు. హామీలు అమలు చేయకుండా రెడ్ బుక్ పాలనపై దృష్టి సారించారు.

– వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, వేమూరు

హామీలు తుంగలో తొక్కారు



చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. చంద్రబాబు ఆర్భాటం కోసం చేస్తున్న అప్పులతో ఆంధ్రప్రదేశ్ అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారుతోంది.

– డాక్టర్ ఈవూరు గణేష్, వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, రేపల్లె

హామీలేవీ నెరవేర్చని ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల వేళ సూపర్ సిక్స్ వంటి హామీలను ఇచ్చి గద్దెనెక్కింది. అధికారం చేపట్టి ఏడాది పూర్తి అయినప్పటికీ సూపర్ సిక్స్ విషయం పూర్తిగా విస్మరించింది. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నమ్మి ఓటు వేసిన ప్రజలకు ఆయన అప్పులు చూపించడం విడ్డూరం. ప్రజల సంక్షేమ పథకాల గురించి పూర్తిగా విస్మరించడం బాధాకరం.

-అక్కల రవీంద్రరెడ్డి, చినగంజాం

న్యూస్‌రీల్

వైభవంగా శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక కొత్తపేట (పశువుల ఆసుపత్రి)లోని శ్రీజగన్నాథస్వామి వారి దేవస్థానంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారిని పెండ్లి కుమారునిగా, రుక్మిణి, సత్యభామ అమ్మవార్లను పెండ్లి కుమార్తెగా అలకరించారు. రాత్రి 7 గంటలకు అంకురారోపణ, కలశస్థాపన, ధ్వజారోహణ, విశ్వక్సేన పూజ, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. వారికి నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈవో టి.సుభద్ర పర్యవేక్షించారు.

ఆళ్ల నాగేశ్వరరావుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

తెనాలి: తెనాలికి చెందిన కవి, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు పేరు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. విజయవాడకు చెందిన 'తెలుగు కళారత్నాలు' సాంస్కృతిక సేవా సంస్థచే సోమవారం అర్ధరాత్రి వరకు ఏకధాటిగా 10 గంటలపాటు జరిగిన సకల కళాప్రదర్శనలో నాగేశ్వరరావు సాహిత్య ప్రదర్శనకు ఈ గౌరవం లభించింది. సంబంధిత ధ్రువీకరణ పత్రం, మెడల్‌ను ఏపీ సచివాలయం ఓఎస్‌డీ డాక్టర్ ప్రభాకర్, విశ్రాంత ఆదాయ పన్ను అధికారి డాక్టర్ పతంగి చెన్నయ్య, ప్రముఖ రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవి సమక్షంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యూవీ రత్నం అందజేశారు.

నేడు నాగార్జునసాగర్‌లో సామూహిక యోగా

నరసరావుపేట: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశం నాగార్జునసాగర్ వద్ద బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం పేర్కొన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించి యోగా ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామన్నారు. మే 28న ఇప్పటికే కోటప్పకొండపై సామూహిక యోగా నిర్వహించామన్నారు. జూన్ 11న కొండవీడు కోట, జూన్ 18న అమరావతి ధ్యానబుద్ధ విగ్రహం వద్ద సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

చిట్‌ఫండ్ యజమానికి బెయిల్ మంజూరు

గుంటూరులీగల్: గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ జడ్జి కోర్టు మంగళవారం చిట్‌ఫండ్ యజమానికి బెయిల్ మంజూరు చేసింది. పాలడుగు పుల్లారావు సాయిసాధన చిట్‌ఫండ్ కంపెనీ నడుపుతూ రూ.కోట్లు స్కామ్ చేసి ప్రజలను మోసం చేశాడనే అభియోగంపై అరెస్టడయ్యారు. దీనిపై నరసరావుపేట-1 టౌన్ సిట్ సీఐడీ వారు కేసు నమోదు చేశారు. ఇరువురి హామీతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 512.00 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 4,050 క్యూసెక్కులు విడుదలవుతోంది.

అయితానగర్‌లో జనతరంగం

- దారిపొడవునా ఉప్పొంగిన అభిమానం
- ప్రియతమ నేతను చూసేందుకు కిక్కిరిసిన అభిమానులు
- బాధిత యువకుల తల్లిదండ్రులను పరామర్శించిన వైఎస్ జగన్
- జనసంద్రాన్ని తలపించిన తెనాలి పర్యటన

తెనాలి:ఎటుచూసినా జనతరంగం... దారిపొడవునా ఉప్పొంగిన అభిమానం... ప్రియతమ నేతను కనులారా చూసేందుకు ఆత్రుత, ఆరాటం... వెల్లువలా కదిలివచ్చిన జనంతో కిక్కిరిసిన రోడ్లు... జననేత కనిపించగానే చిరునవ్వులు చిందిస్తూ, ఆ క్షణాలను సెల్‌ఫోన్లలో బంధిస్తూ... హృదయం నిండా సంతోషంతో అభిమానులు మురిసిపోయారు. 'సీఎం.. సీఎం..' అంటూ తమ మనసులోని కోరికను పదేపదే నినదించారు. నడిరోడ్డుపై బహిరంగంగా పోలీసుల దాష్టీకానికి గురైన ముగ్గురు దళిత, మైనారిటీ యువకుల తల్లిదండ్రులను పరామర్శించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చేసిన పర్యటన ఆద్యంతం జనసంద్రాన్ని తలపించింది.



ఉప్పొంగిన అభిమానం.. తెనాలిలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జేజేలు పలుకుతున్న జన సందోహంలోని ఓ భాగం

పేదలకు అండగా నిలిచేందుకు...

స్థానిక కానిస్టేబుల్‌పై ఏప్రిల్ 24వ తేదీ రాత్రి దాడి చేశారన్న ఫిర్యాదుపై పట్టణానికి చెందిన యువకుడు, ఆ సమయంలో అక్కడే ఉన్న ఇద్దరు మంగళగిరి యువకులను ఏప్రిల్ 27వ తేదీన పోలీసులు అరెస్టు చూపారు. వాస్తవానికి ఘటన జరిగిన మరుసటిరోజునే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషనులో థర్డ్ డిగ్రీ ప్రయోగించటమే కాకుండా, అరెస్టు చూపటానికి ముందే 26, 27వ తేదీల్లో జయప్రకాష్‌నగర్‌లోని సత్యం సమాధి దగ్గర నడిరోడ్డుపై, అయితానగర్‌లోని కూడలి ప్రదేశం నన్నపనేని లింగారావు సెంటరులో టూటౌన్, త్రీటౌన్ సీఐలు ఆ యువకులను బహిరంగంగా లాఠీలతో హింసించారు. ఇందులో సత్యం సమాధి దగ్గర చేసిన భౌతికదాడి కొద్దిరోజుల క్రితం సోషల్ మీడియాలో వైరల్ కావటం తెలిసిందే. ఏదైనా కేసులో నిందితులను చట్టప్రకారం అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపాల్సిన పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవటంపై దళిత, ప్రజాసంఘాలు ఆగ్రహించాయి. మానవ హక్కుల కమిషన్, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. బాధితుల కుటుంబసభ్యులు టూటౌన్ పోలీస్‌స్టేషనులో పోలీస్ అధికారులపై ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలో బాధిత యువకుల తల్లిదండ్రులను పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తెనాలి వచ్చారు.

నాయకుల ఘనస్వాగతం

పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్టీ వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గెద్దటి సురేంద్ర, తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావులు ఘనంగా స్వాగతం పలికారు. వందలాది ద్విచక్ర వాహనాలు ముందు బయలుదేరగా.. వైఎస్ జగన్ కాన్వాయ్ అనుసరించింది.

అర్ధగంటపాటు పరామర్శలు

మధ్యాహ్నం 12.12 గంటలకు దోమా రాకేష్ నివాసంలో రాకేష్ తల్లిదండ్రులు వాసు-మాధవి, మంగళగిరికి చెందిన షేక్ బాబులాల్ తల్లిదండ్రులు అమీర్‌బాషా-రహమ్‌తున్, చేబ్రోలు జాన్‌విక్టర్ తండ్రి ఇశ్రాయెల్‌ను కలిశారు. పోలీసుల హింసకు సంబంధించిన వివరాలను వారి నుంచి తెలుసుకున్నారు. తమ బిడ్డలను దారుణంగా కొట్టిన పోలీసు అధికారులపై తాము పెట్టిన కేసు రిజిస్టరు చేయాలని, చట్టప్రకారం సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని బాధిత యువకుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. దాదాపు అర్ధగంటసేపు వారితో గడిపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆ ఇంటికి సమీపంలోనే మీడియాతో మాట్లాడారు.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో బ్లాక్ బర్లీ కొనుగోలు

- ఈ నెల 10 నుంచి కొనుగోలు కేంద్రాలు
- పర్చూరు, వంకాయలపాడు, మార్టూరు, ఇంకొల్లులలో కేంద్రాలు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై మార్క్‌ఫెడ్ డీఎం సమీక్ష
- మొత్తం పొగాకు కొంటామన్న కలెక్టర్ వెంకట మురళి
- రైతుల వద్ద 87.23 మిలియన్ కిలోల పొగాకు
- ఇప్పటివరకూ 23.7 మిలియన్ కిలోలు మాత్రమే కొన్న టొబాకో కంపెనీలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రైతుల వద్ద వున్న బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని మేనెల 24న పర్చూరు ప్రాంతంలో పర్యటించిన మంత్రుల బృందం ఆదేశించినా టొబాకో కంపెనీలు మొక్కుబడిగా మాత్రమే పొగాకు కొనుగోలుచేసి చేతులు దులుపుకోవడంతో మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకట మురళిని ఆదేశించింది. మరోవైపు మార్క్‌ఫెడ్‌కు కొనుగోళ్లపై మార్గదర్శకాలు జారీచేసింది. ఈ నెల 10 నుంచి కొనుగోళ్లు మొదలుపెట్టనున్నారు. మంగళవారం మార్క్‌ఫెడ్ డీఎం కొనుగోలు ఏర్పాట్లు పరిశీలించారు. పర్చూరు నియోజకవర్గంలోని పర్చూరు, వంకాయలపాడు, మార్టూరు, ఇంకొల్లు కేంద్రాలుగా మార్క్‌ఫెడ్‌పొగాకు కొనుగోలు చేయనుంది. రైతుల వద్దనున్న మొత్తం పొగాకు కొంటామని జిల్లా కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. మంత్రుల బృందం ఆదేశించి పదిరోజులవుతున్నా ఒక్క జీపీఐ లిమిటెడ్ మినహా మిగిలిన కంపెనీలు పొగాకు కొనేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ప్రభుత్వ ఆదేశాలను టొబాకో కంపెనీలు ఏమాత్రం ఖాతరు చేయడంలేదని వారి కొనుగోళ్ల తీరుచూస్తే అర్థమవుతుంది. మంగళవారంనాటికి 22 టొబాకో కంపెనీలు కలిసి మొత్తం 23.7 మిలియన్ కిలోల పొగాకు మాత్రమే కొనుగోలు చేయగా ఒక్క జీపీఐ లిమిటెడ్ ఒక్కటే 3 వేల మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేసి ముందుంది. ఇంకా వారు రైతుల నుంచి వేగంగా పొగాకు కొనుగోలు చేస్తున్నారు. పెద్ద కంపెనీగా ఉన్న ఐటీసీ 639 మిలియన్ కిలోల పొగాకు మాత్రమే కొనుగోలు చేసింది. వాస్తవానికి ఐటీసీ లాంటి పెద్ద కంపెనీ ఎక్కువగా రైతుల నుంచి బ్లాక్‌బర్లీ కొనుగోలు చేస్తుందని రైతులు భావించినా అనుకున్న స్థాయిలో ఆ కంపెనీ స్పందించలేదు. వాస్తవానికి రైతుల వద్ద 82.23 మిలియన్ కిలోల పొగాకు ఉండగా ఇందులో అన్ని టొబాకో కంపెనీలు కలిపి 23.7 మిలియన్ కిలోల పొగాకు మాత్రమే కొనగా ఇంకా 58.53 మిలియన్ కిలోల పొగాకు రైతుల వద్దవుంది. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఒత్తిళ్లతో మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనాలని ప్రభుత్వం నిర్ణయించింది.

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



అద్దంకి రూరల్: సరిగ కర్రల తోటలో గుర్తు తెలియని మృతదేహం అద్దంకి మండలంలో మంగళవారం లభ్యమైంది. సీఐ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి –నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై మండలంలోని శాంతినగర్ గ్రామ పొలాల్లోని సరిగ తోటలో గుర్తు తెలియని మృతదేహం చెట్టుకు వేలాడుతుండటం గమనించిన స్థానిక రైతులు సీఐకి సమాచారం ఇచ్చారు. వ్యక్తి నాలుగు రోజుల కిందట మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉందని సీఐ తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. మంగళవారం ఇద్దరు మహిళలు అక్కడ అనుమానంగా తిరుగుతుండడంతో స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఇప్పటం గ్రామానికి చెందిన పోతగాని గోపి వేసవి సెలవులకు వేరే ఊరు వెళ్లారు. పక్కనే ఉండే గోపి తమ్ముడు పులి మనోజ్ ఇక్కడే ఉన్నారు. గోపి ఇంటి తాళాలు పగలకొట్టి ఉండడం, అక్కడే ఇద్దరు మహిళలు ఉండడంతో వారిని అనుమానించి పోలీసులకు అప్పగించారు. ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.10 వేలతో పాటు వాచ్ పోయిందని గోపి ఫిర్యాదు ఇచ్చారు. సదరు మహిళలు మాత్రం తాము రైల్వే ట్రాక్ వెంబడి ప్లాస్టిక్ డబ్బాలు సేకరిస్తుంటామని, చోరీ చేసే ధైర్యం లేదని, తాగునీరు పట్టుకుని ఇంట్లో జామకాయలు కోస్తుండగా పట్టుకున్నారని చెబుతున్నారు. ఒకవేళ దొంగతనం చేస్తే ఆ డబ్బు, వస్తువులు తమ వద్ద ఉండాలి కదా అని ప్రశ్నిస్తున్నారు. తాడేపల్లి పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభను జయప్రదం చేయండి

సంఘం జిల్లా అధ్యక్షుడు చినరామిరెడ్డి

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఈనెల 5వ తేదీన విజయవాడలో తలపెట్టిన 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయాలని సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి కోరారు. సంఘం యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆహ్వానించామని, ఆయన సానుకూలంగా స్పందించటంతోపాటు సమావేశానికి హాజరయ్యే ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి చుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- కొత్తగొల్లపాలెం అభివృద్ధిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: చిన్నగంజాం మండలం కొత్తగొల్లపాలెంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశ మందిరంలో అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహించిన పీ-4 కార్యక్రమంలో భాగంగా ఎంపికైన చిన్నగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆ గ్రామంలో ప్రజలు కోరిన సదుపాయాల గురించి వాటి పురోగతిపై ఆరా తీశారు. గృహ నిర్మాణాల కోసం 42 మంది, ఇళ్ల స్థలాల కోసం 13 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి పొజిషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు చిన్నగంజాం తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. గృహ నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్ చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ అధికారి కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో 17 మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు అందాయని వాటిలో రెండు పూర్తి చేశామని, మిగిలిన పనులు జరుగుతున్నాయని, 304 ట్యాప్ కనెక్షన్లను జలజీవన్ మిషన్ పథకం ద్వారా పూర్తికి చర్యలు తీసుకోవడమైనదని, గ్రామంలో 131 సోక్ పిట్స్ మంజూరయ్యాయని, ఆ పనులన్నీ జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వివరించారు. గ్రామంలో 4.48 కిలోమీటర్ల అంతర్గత సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్ల కోసం నిధులు మంజూరయ్యాయని, ఈ పనులను త్వరలో ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఎస్ఈ కలెక్టర్‌కు వివరించారు. పర్చూరు నియోజకవర్గంలో ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.25 కోట్లు ఖర్చు అవుతుందని, ప్రతిపాదనలు సమర్పించడమైనదని ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ వివరించారు. బాపట్ల పురపాలక సంఘ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవన పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తవుతాయని సర్వ శిక్ష అభియాన్ అధికారి వివరించారు. కొత్త గొల్లపాలెం అభివృద్ధి పనులను అధికారులందరూ చిత్తశుద్ధితో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, గృహ నిర్మాణ సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఏపీ సీపీడీసీఎల్ ఈఈ మల్లికార్జునరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దెబోరా, చిన్నగంజాం తహసీల్దార్ ప్రభాకర్, సర్వ శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైమరీ హెచ్‌ఎం పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం పోస్టులను సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో సంఘ సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల పోస్టులన్నీ ఎస్జీటీలతోనే భర్తీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ, సదరు పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కేటాయిస్తున్నారనే సమాచారం రావడం బాధాకరమన్నారు. అలాగే మోడల్ ప్రాథమిక పాఠశాలలకు కేటాయించిన హెచ్‌ఎం పోస్టులను 100 శాతం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని కోరారు. అలాకాకుండా స్కూల్ అసిస్టెంట్ల స్థాయిని తగ్గిస్తూ వారిని తాత్కాలిక ప్రాతిపదికన ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమించటం సరికాదన్నారు. ఈ చర్యను ఉపాధ్యాయ లోకం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలన్నారు. ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ఉద్యమ బాట పట్టేలోగా దీనిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. స్కూల్ అసిస్టెంట్ల సేవలను ఉన్నత పాఠశాలల్లో మాత్రమే ఉపయోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్, షేక్ మగ్బూల్ బాష, బొంతా రవి, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఘరానా నేరగాడు అరెస్టు

- 16వ నంబరు హైవేపై దారిదోపిడీకి పాల్పడి పరారీ
- గంటల వ్యవధిలో పోలీసులకు అప్పగించిన స్థానికులు

ప్రత్తిపాడు: హైవేపై దారిదోపిడీకి పాల్పడిన యువకుల్లో ఒకరిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంకు చెందిన గొర్రెల కాపరి శాఖమూరి శ్రీనివాసరావు మంగళవారం ఉదయం కొత్తమల్లాయపాలెంలో ఉన్న తన గొర్రెల మంద వద్దకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. అదే సమయంలో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన దేవర భవానీప్రసాద్ (21), మరో ఇద్దరు యువకులు నంబరు ప్లేటు లేని స్కూటీపై వచ్చి నడింపాలెం డొంక రోడ్డు వద్ద శ్రీనివాసరావు బైక్‌ను అడ్డగించారు. శ్రీనివాసరావు మెడపై హుక్ ఉంచి చంపుతామని బెదిరించి జేబులో ఉన్న రూ. 3,600 నగదు లాక్కున్నారు. అంతటితో ఆగకుండా ముగ్గురు యువకులు ఆయన ముఖంపై విచక్షణారహితంగా పిడిగుద్దులు గుద్దుతూ దాడికి పాల్పడ్డారు. బైక్ తాళం, ఫోన్ లాక్కుని పక్కనే ఉన్న పొలాల్లోకి విసిరేసి అక్కడి నుంచి బోయపాలెం వైపు పరారయ్యారు. వెంటనే తేరుకున్న శ్రీనివాసరావు ఫోన్ ద్వారా గ్రామస్తులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన గ్రామస్తులు బోయపాలెం పరిసరాల్లో ముగ్గురు యువకుల కోసం గాలించారు. హైవే పరిసరాల్లో ఓ బడ్డీ బంకు వద్ద ఉండటాన్ని గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు పరారయ్యారు. చేతికి చిక్కిన భవానీ ప్రసాద్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు శాఖమూరి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ కె.నాగేంద్ర కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరు పరిచారు.

పలు స్టేషన్లలో కేసులు..

గ్రామస్తులు పోలీసులకు అప్పగించిన భవానీ ప్రసాద్ గురించి ఆరా తీసిన పోలీసులకు విస్తుపోయే విషయాలు తెలిశాయి. ఇతనిపై పల్నాడు జిల్లాలోని నరసరావుపేట వన్ టౌన్, టూటౌన్, రూరల్, నకరికల్, సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, బాపట్ల జిల్లాలోని మార్టూరు, పెదనందిపాడు, పర్చూరు, గుంటూరు జిల్లాలోని పెదకాకాని తదితర స్టేషన్లలో 27 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

చదువుల ఒడిలో గుడి..!

- పంతాలకు వేదికగా మారిన కొత్త కొత్తపాలెం ఎస్సీ కాలనీలోని పాఠశాల
- నాడు – నేడు మరుగుదొడ్లను సైతం కూల్చివేసిన వైనం



కొత్త కొత్త పాలెం పాఠశాల భవనం

నూజెండ్ల: భవిష్యత్ తరాలకు ఉపాయోగపడాల్సిన పాఠశాల గ్రామస్తుల పంతాలకు వేదికైంది. దీంతో అక్కడ చదువుతున్న 35 మంది విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకమయ్యాయి. పాఠశాల ఆవరణలో గుడి నిర్మించాలని ఓ వర్గం నడుం బిగించగా విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుంది వేరే చోట ఏర్పాటు చేయాలని మరో వర్గం వారు నిలవరించటానికి ప్రయత్నిస్తున్నారు. మండలంలోని కొత్త కొత్త పాలెం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో చేపడుతున్న గుడి నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఇందు కోసం గత ప్రభుత్వ హయాంలో పాఠశాల ఆవరణలో చేపట్టిన నాడు నేడు మరుగుదొడ్లను సైతం కూల్చి వేశారు. రాత్రికి రాత్రి స్థలాన్ని చదును చేశారు. నిర్మాణ పనులు వేగవంతం చేశారు. భక్తులకు అందుబాటులో గుడి నిర్మాణం చేపట్టడం ఆనందమే కానీ ప్రశాంత వాతావరణంలో చదువుకోవాల్సిన విద్యార్థులకు ఇబ్బంది కాదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అనుకూలమైన మరో ప్రాంతంలో గుడి ఏర్పాటు చేసుకోవచ్చు కదా అని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు. అయితే గుడి కట్టాల్సిందే ఎవరు అడ్డు వస్తారో చూస్తామంటూ.. ఎంత వారించినా వినకుండా ఇటువంటి అనైతిక దుశ్చర్యకు కొంత మంది పాల్పడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి బడి స్థలంలో నిర్మాణాలు అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వివాదంపై ఎంఈఓ రవిచంద్రను వివరణ కోరగా కొంత మంది గ్రామస్తులు ఫిర్యాదు చేశారని సంఘటనా స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

హోంమంత్రి అనిత వ్యాఖ్యలు చట్ట విరుద్ధం

దళిత సంఘాల ఆధ్వర్యంలో అద్దంకిలో ఆత్మరక్షణ ర్యాలీ



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

అద్దంకి: దళిత యువకులపై పోలీసులు చేసిన దమనకాండపై హోం మంత్రి అనిత వ్యాఖ్యలు చట్టవిరుద్ధమని దళిత సంఘ నాయకుడు నీలం నాగేంద్రరావు మండిపడ్డారు. మంగళవారం తెనాలిలో దళిత యువకులపై జరిపిన తాలిబన్ తరహా కూటమి ప్రభుత్వ ఖాకీ దమనకాండపై అద్దంకిలోని అంబేడ్కర్ భవన్ నుంచి బంగ్లా రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నాగేంద్ర మాట్లాడుతూ దళిత యువకులపై దమనకాండకు కారకులైన తెనాలి 2 టౌన్ సీఐ రాములు నాయక్, 3 టౌన్ సీఐ రమేష్ బాబులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జనసేన మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మంత్రివర్గం నుంచి చంద్రబాబు నాయుడు తొలగించాలని డిమాండ్ చేశారు. తెనాలి దళిత యువకులపై పోలీసు అధికారులు చేసిన రాజ్య హింసపై కూటమి ప్రభుత్వం చేసిన కుట్ర పూరిత వ్యాఖ్యలు చట్ట విరుద్ధమని, రాజ్యాంగ వ్యతిరేకమని మండిపడ్డారు. తెనాలి దళిత యువకులపై స్థానిక మంత్రి నాదెండ్ల మనోహర్ కుట్ర పూర్వకంగా పోలీసుల చేత అనాగరిక దాడి జరిపించారని ఆరోపించారు. మూడు నెలల క్రితం తెనాలి అయితానగర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని పోలీసులు మున్సిపల్ అధికారులచే అధికార బలంతో తొలగించాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రయత్నించారన్నారు. కానీ స్థానిక దళితుల ఆందోళనలతో ఆ ప్రయత్నం నీరుగారి పోయిందన్నారు. ఆ ఘటనలో పోలీస్ అధికారులకు స్థానిక దళితులకు మధ్య వివాదం నెలకొందన్నారు. చిరంజీవి అనే విశ్వాసమైన పోలీస్ కానిస్టేబుల్‌తో ఫిర్యాదు తీసుకొని పోలీస్ మామూళ్ల కోసం వేధించి, తెనాలిలో దళిత, ముస్లిం యువకులపై తెనాలి 2 టౌన్ సీఐ రాములు నాయక్, 3 టౌన్ సీఐ రమేష్ బాబులు తాలిబన్ తరహా పోలీస్ శిక్ష వేశారన్నారు. ఒంగోలులో తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్య చౌదరిని కిరాతకంగా హత్య చేసిన తెలుగుదేశం పార్టీ నాయకుల్ని పోలీస్ అధికారులు ఎలా చూశారో, దళిత యువకుల పట్ల ఎలా ప్రవర్తించారో అందరికీ తెలుసన్నారు. విశాఖపట్నంలో డాక్టర్ సుధాకర్‌ని నడిరోడ్డుపై పోలీసులు దాడి చేసి కొట్టినప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న అనిత డాక్టర్ సుధాకర్ ఇంటికి వెళ్లి పరామర్శించలేదా అని ప్రశ్నించారు. హోం మంత్రి అనిత గతంలో ఉపాధ్యాయురాలేనని, రాజ్యాంగ నిపుణురాలు కాదని, న్యాయశాస్త్రం చదవలేదని తెలుసుకోవాలన్నారు. చట్ట ప్రకారం పోలీసులు కేసు నమోదు చేస్తే కోర్టులు శిక్షలు విధించాలి కానీ, శిక్షలు విధించే అధికారం ఏ ప్రభుత్వంలోనైనా పోలీసులకు లేదన్నారు. కేవలం తాలిబన్లు మాత్రమే బహిరంగ శిక్షలు వేస్తారని గుర్తు చేశారు. నేరానికి, పోలీస్ శిక్షలకు కులం ఉంటుందని తెలుగుదేశం న్యాయదేవత, రాజ్యాంగ నిపుణురాలు హోం మంత్రి అనిత తెలుసుకోవాలన్నారు. నిందితులైన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ చట్ట ప్రకారం అరెస్టు చేయాలన్నారు. మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, అద్దంకి నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్, కాకుమాను రవి ఈ నిరసన కార్యక్రమానికి నాయకత్వం వహించారు. యానాది సేవా సమితి నాయకులు పోలా జీవరత్నం, ఆదినారాయణ ఎమ్మార్పీఎస్ నాయకులు యోహాన్, అంబేడ్కర్ పోరాట వేదిక కన్వీనర్ ఎర్రమల శ్రీనివాసరావు, గొడ్డటి రవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రూ.51 కోట్లతో అభివృద్ధి పనులు

ఆమోదం తెలిపిన స్టాండింగ్ కమిటీ



స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు, సభ్యులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సుమారు రూ.51 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులను నిర్వహించడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని స్టాండింగ్ కమిటీ చైర్మన్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ చాంబర్‌లో జరిగింది. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన 143 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై సభ్యులు, వివిధ విభాగాధిపతులతో చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర శివారు, నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాలలో రోడ్లు, డ్రైయిన్లు, వీధి దీపాలు, తాగు నీటి పైపులైన్లు ఏర్పాటు వంటి పనులకు ఆమోదం తెలిపామన్నారు. నాజ్ సెంటర్, స్వామి థియేటర్ వద్ద, అడవితక్కెళ్ళపాడులలోని షాపింగ్ కాంప్లెక్సులలో లీజు గడువు పూర్తయిన షాపులకు నిబంధనల ప్రకారం రెన్యూవల్ చేయడానికి ఆమోదించామన్నారు. గుంటూరు నగరంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉండటంతో వాటికి శస్త్ర చికిత్సలు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేసేందుకు అదనంగా ముగ్గురు పశువుల డాక్టర్లు, ఆపరేషన్ థియేటర్ సహాయకులను నియమించాలని నిర్ణయించామని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వర రావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నగర పాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి



చీరాల రూరల్: రైలు ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చీరాల-స్టువర్టుపురం రైల్వేస్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. విజయవాడవైపు వెళ్లే డౌన్‌లైన్‌లో వృద్ధుడు మృతి చెందాడనే సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉంటాయని, రైలు ఢీకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని.. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుని గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే 9440627646 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

లైంగికదాడి అనంతరం హత్య చేసి ఉంటారని స్థానికుల అనుమానం



మంచంపై మల్లీశ్వరి మృతదేహం (ఇన్‌సెట్లో) తాడిపత్రి మల్లీశ్వరి (ఫైల్)

తెనాలి రూరల్: తెనాలిలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. లైంగికదాడి తర్వాత హత్య చేసి, ఆభరణాలు చోరీ చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... పట్టణ ముత్తెంశెట్టిపాలెం తూర్పు కాల్వ కట్ట రోడ్డులో కబేళా వంతెన నుంచి వైకుంఠపురం వెళ్లే మార్గంలో అయ్యప్పస్వామి గుడి పక్కనే తాడిపత్రి మల్లీశ్వరి (60) ఒంటరిగా నివసిస్తోంది. టిఫిన్ బండి, టీ స్టాల్, కూల్‌డ్రింక్ దుకాణం నిర్వహిస్తోంది. ప్రతి రోజు తెల్లవారుజామున 4.30 గంటలకు లేచి టిఫిన్ బండి పనులను ప్రారంభిస్తుంటుంది. అదే సమయంలో టీ కూడా విక్రయించడంతో ఉదయాన్నే అక్కడి వారు టీ తాగేందుకు వస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వచ్చిన వారు మల్లీశ్వరి బయటకు రాలేదని, ఇంటి కిటికీ నుంచి చూశారు. ఇంకా మంచంపైనే ఉంది. పిలిచినా స్పందన లేకపోవడంతో ఇదే ప్రాంతంలో నివసించే ఆమె కుమార్తెకు సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి చూడగా మల్లీశ్వరి మృతి చెంది ఉన్నట్టు గుర్తించింది. మృతురాలి ఒంటిపై బంగారు ఆభరణాలు, బీరువాలోని నగలు చోరీకి గురైనట్టు తెలిసింది. స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తెనాలి వైద్యశాలకు తరలించారు.

మృతిపై అనేక అనుమానాలు..

మల్లీశ్వరి మృతిపై స్థానికుల నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి తలుపునకు బయట గడి పెట్టి ఉండడం, విగతజీవిగా పడి ఉన్నప్పుడు శరీరంపై దుస్తులు సరిగా లేకపోవడం, ఆభరణాలు మాయమవడంతో ఆమెపై లైంగిక దాడికి పాల్పడి, హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. అనంతరం ఆభరణాలు, నగదు దోచుకెళ్లి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. మల్లీశ్వరిది అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని, దర్యాప్తులో మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశం ఉందని సీఐ తెలిపారు.

మోసగించిన వారిపై చర్యలు తీసుకోండి

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన మహిళ



నరసరావుపేట ఎస్పీ కార్యాలయం వద్ద బాధితురాలు మంజుభార్గవి, బంధువులు

నాదెండ్ల: ఓ వివాహిత తనకు జరిగిన మోసం, అన్యాయంపై పల్నాడు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన మంజుభార్గవి బాపట్ల జిల్లా అద్దంకి పట్టణంలో తన నానమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంది. ఆ సమయంలో విశ్వభారతి జూనియర్ కాలేజ్ డైరెక్టర్, తమ దూరపు బంధువు అయిన సోడిశెట్టి రామానాయుడు తనను ప్రేమ పేరిట లోబరుచుకున్నాడని, గర్భిణిని చేశాడని పేర్కొంది. వివాహం చేసుకోమని అడిగితే ముఖం చాటేశాడని, అధికకట్నం తీసుకుని మరో మహిళను పెళ్లి చేసుకునేందుకు సిద్ధపడ్డాడని పేర్కొంది. ఈ విషయమై తాను 2022 ఫిబ్రవరి 8న నరసరావుపేటలోని దిశా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. రామానాయుడు తల్లి వెంకట సుబ్బమ్మ, బంధువులైన దుర్గాప్రసాద్, విజయవాడలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మేకల నరేంద్ర తనతో మాట్లాడి రామానాయుడితో వివాహం జరిపిస్తామన్నారు. కొన్ని రోజుల తర్వాత రామానాయుడు సోదరుడు కామేశ్వరరావును వివాహం చేసుకోవాలంటూ తనను బలవంతం చేయటంతో అంగీకరించానన్నారు. కామేశ్వరరావుతో తనకు వివాహమైన మూడు రోజుల తర్వాత 16 రోజుల పండుగకు వస్తానని చెప్పి కామేశ్వరరావు వెళ్లిపోయాడని పేర్కొంది. రామానాయుడు తనకు అసభ్యకరరీతిలో వాట్సాప్‌లో మెసేజీలు పెట్టేవాడని వాపోయింది. విషయాన్ని కామేశ్వరరావుకు ఫోన్‌లో చెప్పినా పట్టించుకోలేదని, నీకు తగిన శాస్తి జరిగిందంటూ తిట్టాడని వాపోయింది. 2023 ఏప్రిల్ 27న తన తల్లిదండ్రులు, తమ్ముడితో కలిసి అత్తారింటికి వెళ్లగా, తన అత్త చెప్పాపెట్టకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయిందన్నారు. అప్పటి నుంచి తన తల్లితో అద్దంకిలోనే ఉంటున్నానని పేర్కొంది. ఏఆర్ కానిస్టేబుల్ నరేంద్ర, దుర్గాప్రసాద్‌లు తన ఫోన్‌ను హ్యాక్ చేసి 2023లో తనపై బంధువులకు చెడుగా ప్రచారం చేశారని వాపోయింది. వారు పలుమార్లు తనపై హత్యాయత్నం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. తనను మోసగించిన రామానాయుడు, తన భర్త కామేశ్వరరావు, ఏఆర్ కానిస్టేబుల్ నరేంద్ర, దుర్గాప్రసాద్‌లపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరింది. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోం మంత్రి అనిత, మంత్రి లోకేష్ లకు ఫిర్యాదు అందించినట్లు తెలిపింది.

టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన కారు

- ఒకరు మృతి, మరో నలుగురికి తీవ్ర గాయాలు
- తిరుపతమ్మ దర్శనానికి వెళ్తొస్తుండగా ప్రమాదం



కిలేశపురం వద్ద లారీని ఢీకొట్టి ప్రమాదానికి గురైన కారు



వెంపరాల ఆంజనేయులు మృతదేహం

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): ముందు వెళ్తున్న టిప్పర్‌ను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండం కిలేశపురం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. బాపట్ల మండలం గుడిపూడికి చెందిన వెంపరాల ఆంజనేయులు (45), వెంపరాల నవీన్, వెంపరాల ఓలయ్య, బి.లక్ష్మి, వై.ముత్యాలు(డ్రైవర్) పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి కారులో వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్న అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. వారు ప్రయాణిస్తున్న కారు కిలేశపురం వద్ద అదుపుతప్పి ముందువెళ్తున్న టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ముందుసీటులో కూర్చున్న వెంపరాల ఆంజనేయులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన నవీన్, ఓలయ్య, బి.లక్ష్మి, వై.ముత్యాలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని రెండు 108 అంబులెన్సుల్లో, ఒక హైవే టోల్‌గేట్ అంబులెన్స్‌లో విజయవాడ వైద్యశాలకు తరలించారు. ఆంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.